క్లుప్తంగా

రైతులకు అందుబాటులో ఎరువులు



ఆర్‌బీకేలో ఎరువులను పరిశీలిస్తున్న ఏవో కాశీవిశ్వనాథ్

వేటపాలెం: రైతు భరోసా కేంద్రాల్లో ఖరీఫ్ సీజన్‌కు కావాల్సిన అన్ని రకాల ఎరువులు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి ఐ కాశీవిశ్వనాథ్ తెలిపారు. సోమవారం మండల పరిధిలోని దేశాయిపేట-1 రైతు భరోసా కేంద్రాన్ని ఏవో పరిశీలించారు. కేంద్రలోని ఈ క్రాప్ బుకింగ్, సీసీఆర్ కార్డుల రైతుల డెటాను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ అన్ని రైతు భరోసా కేంద్రాల్లో యూరియా 30 టన్నులు, డీఏపీ 25 టన్ను లు, 20-20-0-13 రకం మూడు టన్నులు, ఎరువులు అందు బాటులో ఉన్నాయని తెలిపారు. అదేవిదంగా దేశాయిపేట-1లో యూనియా-10 టన్నులు, డీఏపీ-10 టన్నులు, 20-20-0-13 మూడు టన్నులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. రైతులు సద్వినియోగించు కోవాలని సూచించారు. కార్యక్రమంలో వీఏఏలు కే మనీష, ఎం శీరిష, వీహెచ్ఏ నాగాంజనేయులు పాల్గొన్నారు.

వేమారెడ్డి సత్రానికి జనరేటర్ అందజేత



జనరేటర్‌ను ప్రారంభిస్తున్న వేమారెడ్డి, సత్రం సభ్యులు

అద్దంకి రూరల్: మండలంలోని శింగరకొండలోని వేమారెడ్డి సేవాసమితి సత్రంలో రూ. 10 లక్షలతో జనరేటర్‌ను సోమవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సత్రం సభ్యులు మాట్లాడుతూ సత్రంలో విద్యుత్ సరఫరా నిలిచిపోయిన సమయంలో జనరేటర్ ఉపయోగకరంగా ఉంటుందన్నారు. క్షేత్రానికి వచ్చి గదుల్లో ఉండేవారికి ఇబ్బంది కలగకుండా జనరేటర్‌ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో వ్యవస్థాపకులు మేడగం ప్రభాకరరెడ్డి, శ్యామల చలమారెడ్డి, బీవీ కృష్ణారెడ్డి, కోట వెంకటేశ్వరరెడ్డి, పాకపాటి అంజిరెడ్డి, సింగం నాగిరెడ్డి, సత్యం తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసరాలు పంపిణీ



నిత్యావసరాలు అందజేస్తున్న దాతలు, రోటరీ సభ్యులు

ఇంకొల్లు (చినగంజాం): రోటరీ క్లబ్ ఆఫ్ ఇంకొల్లు సెంట్రల్ సభ్యులు ఇడుపులపాడు గ్రామంలో ఆసరా వృద్ధాశ్రమంలోని వృద్ధులకు నిత్యావసర సరుకులు, పండ్లు పంపిణీ చేశారు. ఇంకొల్లు గ్రామానికి చెందిన మల్లేశ్వర వరప్రసాద్, కన్యాకుమారి దంపతుల కుమారుడు భగత్ పుట్టిన రోజును పురస్కరించుకొని సోమవారం వృద్ధులకు నిత్యావసర సరుకులు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ ఉపాధ్యక్షులు అలవల శ్రీనివాసరెడ్డి, సభ్యులు సోమేపల్లి రామ్మోహనరావు, భవనం అంజిరెడ్డి, వంకాయలపాటి శ్రీమన్నారాయణ, దాత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

చీరాల తరలిన గోరంట్ల వంశస్తులు

బల్లికురవ: మండలంలోని నక్కబొక్కలపాడు గ్రామంలో గోరంట్లవారి కొలుపుల్లో భాగంగా గ్రామంతోపాటు వివిధ గ్రామాల్లోని గోరంట్ల వంశస్తులంతా సోమవారం చీరాల సముద్ర స్నానానికి తరలివెళ్లారు. ఆలయంలోని శిలలు, బొల్లావులతో సముద్ర స్నానం నుంచి రాత్రికి తిరిగి గ్రామానికి చేరనున్నారు. మంగళవారం గ్రామోత్సవం, బుధవారం ఆలయంలో గోరంట్లవారి దేవర శ్రీగంగమ్మతల్లిని ప్రతిష్ఠించనున్నారు. కొలుపుల్లో భాగంగా బంధుమిత్రులు చేరటంతో గ్రామంలో ప్రతి ఇంట పండగ వాతావరణం నెలకొంది.

వాహనదారులకు జరిమానా

బల్లికురవ: వాహనదారులు ప్రభుత్వానికి చెల్లించాల్సిన ట్యాక్స్‌లు సకాలంలో చెల్లిస్తున్నా.. పత్రాలను వాహనంలో ఉంచుకోవాలని బల్లికురవ ఎస్సై వీ. వేమన కోరారు. సోమవారం సాయంత్రం బల్లికురవ-కొమ్మాలపాడు రోడ్డులో పలు వాహనాలను తనిఖీ చేశారు. తనిఖీలో భాగంగా ధ్రువీకరణ పత్రాలు లేని, హెల్మెట్ ధరించని వాహనదారులకు జరిమానా విధించారు.

27 మార్టూరులో ఉచిత వైద్యశిబిరం

మార్టూరు: మండల కేంద్రం మార్టూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఈనెల 27వ తేదీ ఆదివారం ఉదయం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్టూరు గ్రానైట్ ఫ్యాక్టరీ అసోసియేషన్, మార్టూరు రోటరీ క్లబ్ సంయుక్తంగా నిర్వహించనున్న శిబిరంలో గుండె, కిడ్నీ, కీళ్ల, ఎముకలు, చర్మం, కళ్లు, దంతం తదితర వైద్యులచే పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు, భోజన వసతి సమకూర్చనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.



కళాతోరణంగా ఉన్న గొర్రెపాడు ప్రాథమిక పాఠశాల ద్వారం



బల్లికురవ ఉన్నత పాఠశాలలో నిర్మించిన అదనపు గదులు



బల్లికురవ ప్రాథమిక పాఠశాలలో నిర్మించిన గదులు

అవి బడులు కాదు.. గుడులు

- నాడు-నేడుతో రూపురేఖలు మారిన పాఠశాలలు
- కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా మౌలిక వసతులు, అదనపు గదులు
- 52 పాఠశాలలు, 5 అంగన్‌వాడీ కేంద్రాలు, నాడు-నేడులో రూ.17 కోట్లతో అభివృద్ధి పనులు

బల్లికురవ:

చదువే మన పిల్లలకు ఇచ్చే ఆస్తి.. చదువే అన్నింటికి మూలం. చుదువుకుంటే చాలు తనను తాను, కుంటుబాన్ని మార్చి వేయగల శక్తి దాని సొంతం. అందుకే సీఎం జగన్ మోహన్‌రెడ్డి అప్పుడప్పుడు చదువు గురించి గొప్పగా చెప్తుంటారు. ఈ నాలుగున్నర సంవత్సరాల కాలంలో నాడు-నేడు 1,2 దశల్లో ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయికి తీసుకొచ్చిన ఘనత సీఎం జగన్‌దే. గత ప్రభుత్వాలు ప్రభుత్వ పాఠశాలలను గాలి కొదిలేసింది. అంతేకాకుండా కార్పొరేట్ సేవలో తరించి ప్రభుత్వ పాఠశాలలను నిర్వీర్యం చేసింది. నేడు అమ్మఒడి, జగనన్న విద్యాకానుక, జగనన్న గోరుముద్ద, విద్యాకానుక, విదేశీ దీవెన, వసతి దీవెన ఇలా అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి విద్యను బలోపేతం చేశాడు. అంతేకాకుంగా సాంకేతిక యుగంలో ప్రభుత్వ పాఠశాలల పిల్లలు ముందుండాలన్న ఉద్దేశంతో బైజూస్‌లాంటి సంస్థతో ఒప్పందం కుదుర్చుకొని ట్యాబ్‌లు అందజేశాడు. దీంతో తల్లిదండ్రులు, పిల్లలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. 52 పాఠశాలలు, 5 అంగన్‌వాడీ కేంద్రాలు, నాడు-నేడులో రూ.17 కోట్లతో అభివృద్ధి పనులు చేశారు.

రూ. 17.05 కోట్లతో అభివృద్ధి పనులు..

నాడు-నేడు మొదటి దశలో బల్లికురవ, పెదఅంబడిపూడి, ఉప్పుమాగులూరు, వైదన, కొప్పెరపాడు ఐదు ఉన్నత పాఠశాలలు మరో 15 ప్రాథమిక పాఠశాలల్లో మంచినీరు, మరుగుదొడ్లు, ప్రహరీలు, విద్యుత్, విద్యార్థులు కూర్చునేందుకు బల్లలు, ఆకర్షణీయమైన బొమ్మలు, పెయింట్స్, తరగతి గదుల్లో స్మార్ట్ టీవీలు ఏర్పాటు చేశారు. గదులు కొరత ఉన్న చెన్నుపల్లి, కొప్పరపాలెం, మల్లాయపాలెం, ముక్తేశ్వరం ప్రాథమికోన్నత పాఠశాల, కెజీబీవిలో అదనపు గదుల నిర్మాణంతో కలిపి రూ.10.49 కోట్లు మంజూరుతో పనులు తుదిదశకు చేరాయి. పీఎంసీ కమిటీ, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయుల పర్యవేక్షణలో నాణ్యత ప్రమాణాలతో అవినీతికి తావులేకుండా పనులు పూర్తయ్యాయి. అభివృద్ధి పరిచిన పాఠశాలలను ఉన్నత విద్య గుంటూరు, ప్రకాశం జిల్లాల ఆర్జేడీ బీఎస్ సుబ్బారావు తనిఖీ చేశారు. పాత మల్లాయపాలెం ప్రాథమికోన్నత పాఠశాలను సర్వాంగ సుందరంగా అభివృద్ధి పరిచినందుకు హెచ్‌ఎం జీ. రవికుమార్‌కు ఉమ్మడి ప్రకాశం జిల్లా కింద అవార్డు, ప్రశంస పత్రం అందజేశారు. మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, ఎంపీ మాగుంట శ్రీనివాసరెడ్డి, జిల్లా కలెక్టర్, డీఈవోల చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. మండలంలోని 52 పాఠశాలలు, 5 అంగన్వాడీ కేంద్రాలు అభివృద్ధి చెందటం పట్ల విద్యార్థుల తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



మా బడి బాగుంది..

మా పేర్లు గుర్రాల మధులత, కత్తి యశ్విత. బల్లికురవలో రెండో తరగతి చదువుతున్నాం. గతంలో మాబడి కూలిపోయే దుస్థితిలో ఉండేది. జగన్ మామ అభివృద్ధి చేయడంతో మా బడి చాలా బాగుంది. కూర్చోవడానికి బల్లలు చక్కగా ఉన్నాయి. మధ్యాహ్న భోజనం చాలా రుచిగా ఉంటోంది. మా ఉపాధ్యాయులు చక్కగా చదువు చెప్తున్నారు. సంతోషంగా ఉంది.

ట్యాబ్‌లతో సులువుగా అర్థమౌతున్నాయి..



నాపేరు పీ. దివ్య. బల్లికురవ ఉన్నత పాఠశాలలో 9 వతరగతి చదువుతున్నాను. జగన్ మామ గత విద్యా సంవత్సరంలో ట్యాబ్‌లు అందజేశారు. ఈ ట్యాబ్‌లతో పాఠాలు సులువుగా అర్థమౌతున్నాయి. సబ్జెక్టులో సందేహాలు ఉంటే ఉపాధ్యాయులు వెంటనే నివృత్తి చేస్తున్నారు.

నాడు-నేడు విద్యావ్యవస్థలో ఓ విప్లవం..



నాడు-నేడుతో విద్యావ్యవస్థలో కొత్తశకం మొదలైంది. పాఠశాలలో ఎటువంటి కొరతలు లేకుండా విద్యార్థులకు అవసరమైన అన్ని వసతులను ప్రభుత్వం సమకూర్చింది. గతంలో తల్లిదండ్రులు విద్యార్థుల చదువుకు డబ్బు ఖర్చు పెట్టేవారు. ప్రస్తుతం అమ్మఒడితో తల్లుల ఖాతాకు సొమ్ముజమతోపాటు జేవీవీ కిట్లు, జగనన్న గోరుముద్దతో మంచి పౌష్టికాహారం అందిస్తున్నారు. పాఠశాలల నిర్వహణకు సొమ్ము జమతో విద్యావ్యవస్థ పూర్తిగా మారిపోయింది. డ్రాపౌట్స్ తగ్గి ఎక్కువ మంది విద్యార్థులు పాఠశాలకు వస్తున్నారు.



స్మార్ట్ టీవీలో సీఎం జగన్ సందేశాన్ని వింటున్న విద్యార్థులు



బల్లికురవలో విద్యార్థుల కోసం నిర్మించిన టాయిలెట్స్

నిరంతరాయంగా విద్యుత్ సరఫరా

- గ్రామాల్లో త్రీ ఫేస్ విద్యుత్
- ఏపీ శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్య

జే.పంగులూరు: అంతరాయం లేకుండా 24 గంటలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా చేసేందుకు కృషి చేస్తున్నామని ఏపీ శాప్‌నెట్ చైర్మన్ బాచిన కృష్ణ చైతన్య పేర్కొన్నారు. మండల పరిధిలోని పంగులూరు సబ్ స్టేషన్ నుంచి ఐదు గ్రామాలకు నూతన విద్యుత్ లైన్లు, సంభాలు ఏర్పాటు చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన కరెంట్ స్తంభాల ఏర్పాటుకు సోమవారం భూమి పూజ చేసి టెంకాయి కొట్టి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరితగతిన విద్యుత్ లైన్లు ఏర్పాటు పూర్తి చేయాలన్నారు. డీఈ మస్తాన్‌రావు మాట్లాడుతూ పంగులూరు సబ్‌స్టేషన్ నుంచి కోటపాడు, కొండమంజులూరు, జనకవరం, కొటపాడు, పంగులూరు గ్రామాలకు రూ. 3.95 కోట్లతో నూతనంగా విద్యుత్ లైన్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. 13 కిలో మీటర్లు మేర 450 స్తంభాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.17, 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. దీనివలన గ్రామాల్లో కూడా త్రీ ఫేస్ కరెంట్ వచ్చేవిధంగా చేస్తున్నట్లు తెలిపారు. తద్వారా గ్రామాల్లో రైస్ మిల్లులు, వెల్డింగ్ షాపులు నిర్వహించేందుకు వీలుగా ఉంటుందని, ప్రభుత్వం గ్రామాల్లో పారిశ్రామిక వేత్తలు తయారు చేస్తుందని తెలిపారు. అనంతరం ఐదు గ్రామాల సర్పంచ్‌లు కృష్ణచైతన్యను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో మండల అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు రాయిణ వెంకట సుబ్బారావు, జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యుడు చిలుకూరి సాంబశివరావు, ఏఈ బాల కోటేశ్వరావు, ఆంజనేయులు, ఏడీ సత్యనారాయణ గ్రామ సర్పంచ్ గుడిపూడా నాగేంద్రం రామారావు, ఎంపీటీసీ సభ్యులు ఎస్ రాములమ్మ, కోప్షన్ సభ్యులు ఖాశీం, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



పంగులూరు సబ్‌స్టేషన్ వద్ద భూమి పూజ చేస్తున్న శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్య

నూతన ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం..

అద్దంకి రూరల్: అద్దంకి రాజీవ్‌నగర్‌లోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో 5 ఎంవీఏ నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను కృష్ణచైతన్య ప్రారంభించారు. కార్యక్రమంలో ఈఈ మస్తాన్‌రావు, విద్యుత్ సిబ్బంది, మున్సిపల్ వైస్‌చైర్మన్ పద్మేష్, స్థానిక నాయకులు సందిరెడ్డి రమేష్, కాకాని రాధాకృష్ణమూర్తి, వార్డు కౌన్సిలర్‌లు, గ్రామ సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.



రాజీవ్‌నగర్‌లో ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న కృష్ణచైతన్య, తదితరులు

జగనన్న పాలనలో ప్రజలంతా సంతోషం

- గడప గడపలో శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్య

అద్దంకి: సీఎం జగన్ మోహన్‌రెడ్డి పాలనతో ప్రజలంతా సంతోషంగా ఉన్నారని రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్, అద్దంకి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య అన్నారు. సోమవారం మండలంలోని శింగరకొండ పాలెం పంచాయతీ పరిధిలోని కొత్తరెడ్డి పాలెం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ఇంటింటికి తిరుగుతూ సంక్షేమ పథకాలు అందుతున్న తీరును పరిశీలించారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థతో గ్రామాలోని సమస్యలు సులభంగా పరిష్కరించుకో వచ్చున్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి నవరత్నాల్లోని హమీలన్నీ నెరవేర్చిన ఘనత జగనన్నదే నన్నారు. కులమతాలకు, పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. తొలుతగా గ్రామంలోని వైఎస్సార్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ప్రజల గుండెల్లో గూడు కట్టుకున్న సీఎం జగనన్నను వచ్చే ఎన్నికల్లో మళ్లీ సీఎంగా గెలిపించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ అవిశెన జ్యోతి, మండల కన్వీనర్ జ్యోతి హనుమంతరావు, శింగరకొండ పాలెం సర్పంచ్ వై తిరుపతయ్య, సర్పంచ్‌లు, గ్రామ నాయకులు పాల్గొన్నారు.



సంక్షేమ పథకాలను వివరిస్తున్న శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్య

అర్జీల విచారణలో అలసత్వం తగదు

చీరాల టౌన్: ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీలను నిర్ణీత సమయంలోగా విచారించి పరిష్కరించాలని తహశీల్దార్ జీవిగుంట ప్రభాకరరావు సూచించారు. సోమవారం తహశీల్దార్ కార్యాలయంలో గ్రామ, పట్టణ రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించారు. గ్రామాలు, సచివాలయాల పరిధిలో పెండింగ్‌లో ఉన్న అర్జీలు, పాసు పుస్తకాలు, రెవెన్యూ అజమాయిషీ, నాలా కన్వర్షన్, స్పందన అర్జీలపై సమావేశాన్ని నిర్వహించారు. సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించాన్నారు. సమావేశంలో డిప్యూటీ తహశీల్దార్ పి.సురేష్‌కుమార్, ఆర్ఐ శేఖర్, వీఆర్వోలు ఉన్నారు.

ఆక్రమణలు తొలగించాలని వినతి

చీరాల టౌన్: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేడ్కర్ భవన్ నిర్మాణానికి స్థలం కేటాయించాలని గవర్నర్ ఆదేశాలిచ్చినా అధికారులు పట్టించుకోకపోవడం దారుణమని పలువురు ప్రజాసంఘాల నాయకులు అన్నారు. సోమవారం తహశీల్దార్ కార్యాలయంలో జరిగిన స్పందన అర్జీల స్వీకరణలో తోటవారి పాలెం బండారు నాగేశ్వరరావు కాలనీలో రోడ్లను ఆక్రమించి నిర్మాణాలు చేయడంతో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నామన్నారు. కాలనీలో ఇష్టానుసారంగా ఆక్రమణలు జరుగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని వాపోయారు. అలానే రంగారావుపేటలో సర్వే నెంబర్ 798-2,3లో బాపట్ల ఎంపీ నందిగం సురేష్ అంబేడ్కర్ విజ్ఞాన వికాస కేంద్రానికి 20 సెంట్ల స్థలం కేటాయించాలని సిఫార్సు చేయగా గవర్నర్ ఆదేశాలతోభూమిని కేటాయించాలని ఆదేశించగా నేటికి స్థలాన్ని కేటాయించకపోవడం దుర్మార్గమన్నారు. అనంతరం తహశీల్దార్ జీవిగుంట ప్రభాకరరావు, ఎంపీడీవో నేతాజీలకు వినతిపత్రాన్ని అందించారు. కార్యక్రమంలో జి.ఏసురత్నం, డి.విజయ సుందర్, ఏసోబు, తదితరులు ఉన్నారు.



తహశీల్దార్, ఎంపీడీవోలకు వినతిపత్రాన్ని అందిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

వైద్యశిబిరాలకు విశేష స్పందన

బల్లికురవ: ప్రభుత్వం అవ్వాతాతల ఆరోగ్య సంరక్షణకు గ్రామాల వారీగా ఇంటింటికి వైద్యం, ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు గుంటుపల్లి పీహెచ్‌సీ అధికారి అమీజ్ అహమ్మద్ తెలిపారు. సోమవారం బల్లికురవలో గుంటూరు శంకరవైద్యశాలచే ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 38 మందికి పరీక్షలు నిర్వహించారు. 60 మందిని క్యాటరాక్ట్ ఆపరేషన్‌కు ఎంపిక చేశారు. ఏడుగురికి ఉచితంగా కళ్లద్దాలు అందజేయనున్నట్లు వైద్యాధికారులు రమీజ్‌అహ్మద్, యల్లారెడ్డి తెలిపారు. గురువారం బల్లికురవ గ్రామపంచాయితీ కార్యాలయం వద్ద ఆపరేషన్లకు ఎంపిక చేసిన వారిని గుంటూరు తీసుకెళ్తామని, సిద్ధంగా ఉండాలని తెలిపారు. ఈ శిబిరంలో వైద్యసిబ్బంది, రోగులు పాల్గొన్నారు.

పోతినవారిపాలెంలో

కారంచేడు: మండలంలోని పోతినవారిపాలెం గ్రామంలో బడుగు ఆమోస్ సహకారంతో స్థనిక చర్చ్ ప్రాంగణంలో ఈ ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఒంగోలు కిమ్స్ హాస్పటల్ సహకారంతో గ్రామంలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరంలో గుండె, ఎముకలు, కీళ్ల, నరాలు, కంటికి, దంతాలు తదితర పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో హాస్పటల్ డాక్టర్ రామాంజనేయులు, సునీల్, డాక్టర్ రాణి, సిబ్బందిల సహకారంతో సుమారు 375 మందికి పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. మరో 90 మందికి సిఫార్సు చేసామన్నారు. స్థానిక షేక్‌రఫీ, పీహెచ్‌సీ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

జే.పంగులూరులో..

జే.పంగులూరు: మండల పరిధిలోని ముప్పవరం సొసైటీ కార్యాలయంలో కుక్కపల్లి అంజమ్మ జ్ఞాపకార్థం, హెల్ప్ హాస్పటల్ విజయవాడ వారి ఆదర్యంలో సోమవారం నిర్వహించిన మెడికల్ క్యాప్‌నకు విశేష స్పందన లభించింది. ఈ క్యాంప్ నందు 200 మంది ఉచిత గుండె పరీక్షలు చేయించుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు. వైద్య శిబిరం నందు డాక్టర్ శివప్రసాద్ వైద్యసేవలు నిర్వహించారు.

ప్రతి పంట ఈ-క్రాప్‌లో నమోదు తప్పనిసరి



ఈ-క్రాప్ నమోదు చేస్తున్న అధికారులు

చీరాల టౌన్: రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేక పథకాలు, సబ్సిడీలను నేరుగా రైతులకు అందించేందుకే గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసింది.. రైతులు పండించే ప్రతి పంట ఈ పంటలో నమోదు చేయించుకోవాలని వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కె.రమణారెడ్డి సూచించారు. సోమవారం మండలంలోని తోటవారిపాలెంలో ఖరీఫ్ సీజన్‌లో ఈ-క్రాప్ నమోదును ప్రారంభించారు. గ్రామంలోని మహిళా రైతు గండూరి సరస్వతి పొలంలో ఆర్‌బీకే సిబ్బందితో కలిసి పంట నమోదును ప్రారంభించగా వ్యవసాయ సలహామండలి చైర్మన్ హాజరై మాట్లాడారు. గ్రామాల్లో రైతులు సాగు చేసే ప్రతీ పంట వివరాలు నమోదు చేయించుకోవాలని తద్వారా వరదలు, ప్రకృతి విపత్తుల సమయంలో రైతులకు ప్రభుత్వం నష్ట పరిహారం అందిస్తుందన్నారు. ప్రభుత్వ పథకాలను ఆర్‌బీకేల ద్వారానే అందిస్తుందని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో రైతులు, ఆర్‌బీకే సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీల ద్వారా పౌష్టికాహారం



పౌష్టికాహారం అందిస్తున్న సీడీపీఓ ఝాన్సీ

ఆదిపూడి (కారంచేడు): గ్రామాల్లోని ప్రతి అంగన్‌వాడీ కేంద్రం ద్వారా గర్భిణులు, బాలింతలకు మంచి బలవర్ధమైన పౌష్టికాహారం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని ఐసీడీఎస్ ఇంకొల్లు ప్రాజెక్టు సీడీపీవో తిరుమలశెట్టి ఝాన్సీ అన్నారు. సోమవారం ఆమె మండలంలోని ఆదిపూడి గ్రామంలోని నాలుగు అంగన్‌వాడీ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆమె తనిఖీ చేసిన సమయంలో విద్యార్థుల హాజరు శాతం తక్కువగా ఉంటున్నట్లు గమనించామన్నారు. ప్రతి సెంటర్‌లోను విద్యార్థుల నమోదు, హాజరు శాతంను పెంపొందించుకోవాలన్నారు. ప్రతి సెంటర్ పరిధిలో ఉండే గర్భిణులు, బాలింతలకు అవసరమైన పౌష్టికాహారం వారి ఇళ్లకే పంపిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కారంచేడు సెక్టార్ సూపర్ వైజర్ హిమబిందు, అన్ని సెంటర్ల కార్యకర్తలు, తల్లులు, గర్భవతులు, చిన్నారులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలి



డైరీలు అందిస్తున్న హెచ్‌ఎం శ్రీనివాసరావు

కుంకలమర్రు (కారంచేడు): ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులు నేటి ప్రభుత్వ పాలనలో ఉన్నతంగా ఎదుగుతున్నారని హెచ్‌ఎం పావులూరి శ్రీనివాసరావు అన్నారు. సోమవారం ఆయన మండలంలోని కుంకలమర్రు మొయిన్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు అవసరమైన హ్యాండ్ డైరీలను తన తల్లిదండ్రులైన పావూలూరి సుబ్బారావు-వెంకాయమ్మల జ్ఞాపకార్థం ఉచితంగా అందించారు. హెచ్‌ఎం శ్రీనివాసరావుకు ఉపాధ్యాయులు, విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు సువర్ణబాబు, సునీత, భాగ్యశ్రీ, విద్యార్థులు పాల్గొన్నారు.